సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



ఇంటింటా పోలీస్ తనిఖీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గురువారం డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. సీఐ మొగిలి, ఎస్సై రామ్మోహన్ పాల్గొన్నారు.



చేపపిల్లలు విడుదల

వేములవాడఅర్బన్: నంకెపల్లి వద్ద మిడ్‌మానేరు నీటిలో గురువారం చేపపిల్లలను విడుదల చేశారు. జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, ముదిరాజ్ కులస్తులు పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/19.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రుద్రంగి(వేములవాడ): అనారోగ్యంతో ఆస్పత్రిపాలవుతున్న నిరుపేదలకు అండగా సీఎం సహాయనిధి సహాయపడుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రుద్రంగిలో గురువారం రూ.3.8లక్షల విలువ గల సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, డీసీసీ కార్యదర్శులు చెటుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, తర్రె లింగం తదితరులు ఉన్నారు.

అవగాహనతో నివారించవచ్చు



ఇల్లంతకుంట(మానకొండూర్): అవగాహనతోనే టీబీ వ్యాధిని నివారించవచ్చని టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ఇంపాక్ట్ ప్రోగ్రాం జిల్లా అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇల్లంతకుంట పల్లె దవాఖానాలోని సిబ్బందికి గురువారం ఇంపాక్ట్ ప్రోగ్రాం గురించి వివరించారు. సబ్‌సెంటర్‌ల వారీగా టీబీ చాంపియన్లను గుర్తించి వారి ద్వారా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్య విద్యాధికారి వెంకటరమణ, ఏఎన్‌ఎం స్వప్న, సుహాసిని, హెల్త్ సూపర్‌వైజర్ జవహర్ పాల్గొన్నారు.

హమాలీల కూలీ పెంచాలి



సిరిసిల్లఅర్బన్: ఐకేపీ సొసైటీ హమాలీ కార్మికులకు వేతనాలు పెంచాలని సీపీఐ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి పంతం రవి కోరారు. కలెక్టరేట్ వద్ద హమాలీ కార్మికులతో గురువారం ధర్నా చేపట్టారు. రవి మాట్లాడుతూ ప్రభుత్వమే నేరుగా ప్రతీ టన్నుకు రూ.60 చెల్లించాలని కోరారు. సివిల్ సప్లయ్‌లోని ప్రతీ గట్టాకు రూ.100 చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు భూంపెల్లి భూంరెడ్డి, మిద్దె నర్సన్న, ఆద్య వేణు, రాములు, శంకర్, రాజయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ అబ్జర్వర్‌గా సురేష్



సురేష్

సిరిసిల్లటౌన్/సిరిసిల్ల ఎడ్యుకేషన్: సిరిసిల్లకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ తడకల సురేష్ రాష్ట్ర కబడ్డీ పోటీలకు అబ్జర్వర్‌గా నియమితులయ్యారు. ఈనెల 7 నుంచి 9 వరకు యాదాద్రి జిల్లా భువనగిరిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అబ్జర్వర్‌గా వ్యవహరించనున్నారు. సురేష్ సిరిసిల్ల బాలికల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

• డీఎస్‌వో వసంతలక్ష్మి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి సూచించారు. మండలంలోని బండలింగంపల్లి, సింగారం గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. సన్నవడ్లను కేటాయించిన రైస్ మిల్లర్లతో మాట్లాడి తూకం వేస్తామని, రైతులు ఆందోళన చెందొద్దన్నారు. రెండు గ్రామాల్లో సన్నవడ్ల కొనుగోళ్లను ప్రారంభించారు. తహసీల్దార్ రామచంద్రం, డీటీ నవీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మాజీ సర్పంచ్ మల్లేశం, ఉస్మాన్ పాల్గొన్నారు.

నేడు చేప పిల్లల విడుదల

ఇల్లంతకుంట(మానకొండూర్): అనంతగిరిలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చేపపిల్లలు విడుదల చేయనున్నారు. 80 నుంచి 100 మిల్లీమీటర్ల పొడవు గల చేప పిల్లలను ఉచితంగా రిజర్వాయర్‌లో విడుదల చేయనున్నారు. ఈమేరకు జిల్లా మత్స్యశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

విమానం ఎగిరేనా!



• ఊరిస్తున్న బసంత్‌నగర్ ఎయిర్‌పోర్టు
• కోల్, ఇండస్ట్రియల్, టెంపుల్ కారిడార్‌లో
• విమానాశ్రయం ఏర్పాటు చేయాలనేది దశాబ్దాల కల
• ప్రజాప్రతినిధులపైనే ఆశలు

సాక్షి, ప్రతినిధి కరీంనగర్: బసంత్‌నగర్ ఎయిర్ పోర్టు ఊరిస్తోంది. ఇప్పుడో.. అప్పుడో విమానం ఎగురుతుందంటూ సంవత్సరాలుగా ఉమ్మడిజిల్లా ప్రజానీకం ఎదురుచూస్తోంది. తాజాగా మామునూర్ ఎయిర్‌పోర్టుకు వేగంగా అడుగులు పడుతుంటే, బసంత్‌నగర్ విమానాశ్రయానికి సంబంధించి ప్రతిపాదనలు, పరిశీలనలతో కాలం కరిగిపోతోంది. ప్రధాని మోదీ 2017 ఆగస్టు 27న ×ఉడాన్₹ అనే పథకాన్ని తీసుకొచ్చారు. ఈ స్కీమ్ ద్వారా అనేక రాష్ట్రాల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల మధ్య విమానయాన సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీంతో అప్పటి తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని ఆరు ప్రాంతాల్లో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేయాలని, అందులో బసంత్‌నగర్‌కు కూడా ప్రతిపాదించింది. దీనిలో భాగంగా విమానాశ్రయం ఏర్పాటుకు సానుకూలంగా ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) ఇందుకు కావాలిస్సిన భూమి, అంచనా వ్యయంతో కూడిన ఫీజబిలిటీ రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. అయితే ఈ అంశం వివిధ సాంకేతిక అంశాలతో పక్కకుపోయింది. తాజాగా సాంకేతిక అంశాలను అధిగమించి మామునూర్ ఎయిర్‌పోర్టు పనులు ముందుకుసాగుతున్న వేళ బసంత్‌నగర్‌లో సాంకేతిక అంశాలను అధిగమిస్తే ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అవకాశాలు మెండుగా ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఫీజబిలిటీ రిపోర్టులో

బసంత్‌నగర్‌లో డొమెస్టిక్ తరహా విమానాశ్రయం అయితే రూ.248 కోట్లు ఖర్చు అవుతుందని, 408 ఎకరాల భూమి అవసరముంటుందని, ఇంటర్‌నేషనల్ విమానాశ్రాయం అయితే రూ.321 కోట్లు ఖర్చు అవుతుందని, 566 ఎకరాల భూమి అవసరమని ప్రభుత్వానికి సమర్పించిన టిక్నో ఎకనామిక్ ఫీజబిలిటీ నివేదికలో పేర్కొన్నారు. ఇక్కడ ప్రస్తుతం ఎయిర్ స్ట్రిప్ 287 ఎకరాల్లో ఉంది. దీనికి అదనంగా మరో 400 ఎకరాలను సేకరిస్తే సరిపోతుంది. ప్రస్తుతం ఉన్న ప్రాంతం మీదుగా విద్యుత్ హైటెన్షన్ వైర్లు వెళ్తున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా లైన్లు వేస్తే విమానాశ్రయం ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుంది.

అనేక రకాలుగా అనుకూలం

ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుకు సమీపంలోనే రెల్వేస్టేషన్, హైవే రోడ్డు ఉండటంతో బసంత్‌నగర్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం మినీ ఎయిర్‌పోర్టుగా తయారు చేసుకుని వినియోగించుకుంటోంది. దీంతో ఇప్పుడున్న స్థలానికి మరింత భూమిని సేకరించి విస్తరిస్తే ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దకాలంగా వినిపిస్తోంది. ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల ప్రాంతంలో వివిధ రకాల పరిశ్రమలతో పాటు సింగరేణి గనులు, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ వంటి సంస్థలు ఉన్నాయి. వేములవాడ, కొండగట్టు, కాళేశ్వరం తదితర ఆలయాలు, టూరిజం ప్రదేశాలు ఉన్నాయి. జగిత్యాల నుంచి గల్ఫ్‌కు చాలా మంది వెళ్తుంటారు. విదేశాలకు వెళ్లేందుకు హైదరాబాద్ ఎయిర్ పోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. బసంత్‌నగర్‌లోనే విమానాశ్రయాన్ని ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

150 కి.మీ నిబంధన

శంషాబాద్ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న జీఎంఆర్ సంస్థతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఒప్పందం మేరకు 150 కి.మీ పరిధిలో 2038 వరకు మరో వాణిజ్య విమానాశ్రయం ఉండకూడదనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం మామునూర్ ఎయిర్‌పోర్టుకు శంషాబాద్ నుంచి సుమారు 145 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ నిబంధన సడలింపు చేసేలా అక్కడి నేతలు ప్రయత్నించడంతో ఎయిర్‌పోర్టుకు గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లయింది. బసంత్‌నగర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు సుమారు 250 కిలోమీటర్ల కన్నా ఎక్కువే ఉన్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి, బసంత్‌నగర్‌లో ఎయిర్‌పోర్టు కోసం తమ వంతు ప్రయత్నాలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వారి పైనే ఆశలు పెట్టుకున్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

• ఎస్పీ అఖిల్ మహాజన్
• కోనరావుపేట ఠాణా తనిఖీ



కోనరావుపేట ఠాణాలో పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

కోనరావుపేట(వేములవాడ): ప్రజాఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, రికార్డులు తనిఖీ చేశారు. ఠాణాలోని సిబ్బందికి పలు విషయాలలో సూచనలు చేశారు. కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం వహించొద్దన్నారు. బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది డయల్ 100 కాల్స్‌కు స్పందించాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరచూ గ్రామాలు పర్యటించాలన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

• ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



వేములవాడరూరల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం బొల్లారంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా సీసీ కెమెరాలతో నేరస్తులు పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ గ్రామంలోని ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై మారుతి, మాజీ సర్పంచ్ సుద్దాల లచ్చయ్య, గ్రామస్తులు ఇట్టిరెడ్డి జనార్దన్‌రెడ్డి, సాండెసారి మల్లికార్జున్, వసుంధర పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

• జిల్లా వైద్యాధికారి వసంతరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వసంతరావు

సిరిసిల్ల: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి ఎం.వసంతరావు కోరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో గురువారం నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్ అస్యూరెన్స్(ఎంక్వస్)పై శిక్షణ ఇచ్చారు. స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక మాట్లాడుతూ పల్లె దవాఖాణాల్లో వైద్యసేవలు మరింత విస్తరించాలన్నారు. మార్చి నెలాఖరులోగా ఇంక్వాస్ సాధించే దిశగా చర్యలు చేపట్టాలని వివరించారు. డీఐవో వేణుగోపాల్‌రెడ్డి, డీడీఎం కార్తీక్, డెమో రాజకుమార్, సీహెచ్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



నిమ్మల లహరి



గుండ హరిణి, గుండ శర్వాణి

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/ఇల్లంతకుంట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లాకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎస్‌కే వాసిఫ్ అర్మాన్, నిమ్మల లహరి, వెంకటాపూర్ హైస్కూల్ విద్యార్థులు కంకనాల దీక్షిత, జక్కు మధుప్రియ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. కబడ్డీ పోటీలకు ఇల్లంతకుంట మండలం రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ విద్యార్థులు కర్ల శ్రీనిజ, లింగంపల్లి నిశాంత్ ఎంపికయ్యారు. చెస్ పోటీల్లో నిజామాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు గుండ హరిణి, గుండ శర్వాణి ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు

వేములవాడఅర్బన్: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని వేములవాడ ఎక్సైజ్ సీఐ రాజశేఖర్‌రావు కోరారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం, మై భారత్ నెహ్రూ యువకేంద్రం కరీంనగర్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలతో విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోతున్నారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నెహ్రూ యువకేంద్ర జిల్లా యూత్ అధికారి వెంకటరాంబాబు మాట్లాడుతూ యువత దురలవాట్లకు లోనుకాకుండా పట్టుదలతో చదవాలన్నారు. ప్రిన్సిపాల్ శంకర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లావణ్య, శకుంతల, శారధ, శోభారాణి, ప్రసాద్, కృష్ణప్రసాద్, నర్సయ్య, కరుణ తదితరులున్నారు.

గుంతలు పూడ్చండి

చంద్రంపేట నుంచి పాతబస్టాండ్‌లోని నేతన్నచౌక్ వరకు టీ ఫైబర్ ఇంటర్‌నెట్ కేబుల్ కోసం ప్రధాన రహదారిపై గోతులు తవ్వి పూడ్చకుండా అలాగే వదిలేశారు. ఐదు రోజులుగా మట్టికుప్పలను తొలగించడం లేదు. రాత్రి వేళ ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



ఆటోనగర్‌లో టీ ఫైబర్ కేబుల్ కోసం తవ్వి వదిలిన మట్టికుప్పలు



నేతన్నసర్కిల్ వద్ద రోడ్డుపై మట్టికుప్పలు

బాలికల అభివృద్ధికి ఎంపవర్‌మెంట్ క్లబ్బులు



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

• 100 స్కూళ్లలో క్లబ్బులు
• కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: బాలికల సమగ్రాభివృద్ధికి దోహదపడేలా గర్ల్‌చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్బులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 100 పాఠశాలల్లో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల్లో బాలికల సమస్యలను పరిష్కరించే వ్యవస్థ ఏర్పాటు చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రత, బాలికలకు ఉన్న హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. హెడ్‌మాస్టర్ చైర్‌పర్సన్‌గా, గర్ల్ చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్ కన్వీనర్‌గా, ప్రతీ తరగతి నుంచి యాక్టివ్‌గా ఉండే ఇద్దరు అమ్మాయిలు, మహిళా పోలీస్ కానిస్టేబుల్, లేదా షీటీం సభ్యులతో గర్ల్‌చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైస్కూల్స్, జూనియర్, డిగ్రీ కళాశాలల్లోనూ వీటిని ఏర్పాటు చేయాలన్నారు.

ఆన్‌లైన్ ఫిర్యాదుల వ్యవస్థ

విద్యాసంస్థల్లోని మహిళలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు జిల్లా వెబ్‌పోర్టల్‌లో లింక్ ఏర్పాటు చేయాలని, పాఠశాల, కళాశాల స్థాయిలో ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయాలన్నారు. నెలకోసారి ప్రత్యేక సెషన్ నిర్వహించి గుడ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, స్టాకింగ్, వాయిలెన్స్, చైల్డ్ అబ్యూస్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లోని బాలికలకు ఐఐటీ, నీట్, న్యాయశాస్త్రం వంటి పోటీపరీక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే స్కాలర్‌షిప్స్, ప్రతిభ పురస్కారాల గురించి వివరించాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, జిల్లా వైద్యాధికారి వసంతరావు, సఖీ కేంద్రం కోఆర్డినేటర్ రోజా పాల్గొన్నారు.

సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించాలి

• కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



తాళ్లపల్లి జిన్నింగ్‌మిల్లులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఇల్లంతకుంట(మానకొండూర్): రైతులు తాము పండించిన పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని తాళ్లపల్లి, గాలిపల్లి కాటన్ జిన్నింగ్‌మిల్లుల్లో సీసీఐ కొనగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ప్రతి రోజు లక్ష్యం మేరకు కొనుగోలు చేయాలని, రైతులు తేమశాతం సరిగ్గా చూసుకొని మిల్లుకు తెచ్చి విక్రయించాలని సూచించారు. తాళ్లపల్లి రైతు గుమ్మటాల నరసింహారెడ్డి ధాన్యం తూకం 42 కిలోలు తూకం వేస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. శుభ్రం చేసి తీసుకొస్తే 40.600 కిలోలు మాత్రమే తూకం వేయాలని ఇన్‌చార్జీలకు సూచించారు. ఇల్లంతకుంట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్‌చైర్మన్ ఎలగందుల ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాఘవరెడ్డి, ఐరెడ్డి మహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చిట్టి ఆనందరెడ్డి, డైరెక్టర్లు తిరుపతిగౌడ్, వీరేశం, మచ్చ రాజేశం పాల్గొన్నారు.

కుటుంబ సర్వే పక్కాగా చేయాలి

• అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్
• జిల్లాలో 1,90,626 ఇళ్ల గుర్తింపు
• 1488 ఎన్యూమరేటర్లు, 160 మంది సూపర్‌వైజర్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: సమగ్ర ఇంటింటీ కుటుంబసర్వే పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో గురువారం ప్రత్యేకాధికారులు, మాస్టర్ ట్రైనర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణనిచ్చారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర సర్వేలో భాగంగా వంద శాతం హౌజ్ లిస్టింగ్ చేశామన్నారు. జిల్లాలో 1,90,626 ఇళ్లు ఉన్నాయని, 1468 ఎన్యూమరేషన్ బ్లాక్‌లను గుర్తించామని, ప్రతి 150 ఇళ్ల సర్వేకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున కొంతమంది రిజర్వ్ సిబ్బందితో కలిపి మొత్తం 1488 ఎన్యూమరేటర్లు, 160 మంది సూపర్‌వైజర్లను నియమించామని ఖీమ్యానాయక్ వివరించారు. నవంబర్ 9వ తేదీ నుంచి ప్రతీ ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. పక్షం రోజుల్లో సమగ్ర ఇంటింటీ కుటుంబ సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సర్వే రోజు కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డ్, పాస్‌పుస్తకాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో సమాచారం

ప్రతీ రోజు నిర్వహించే సర్వే వివరాలు ఎప్పటికప్పుడు ఎన్యూమరేటర్ మండల స్థాయిలో తహసీల్దార్ ఆఫీస్‌ల్లో అప్పగించాలని, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇందుకు అవసరమైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించాలని, అవసరమైన మేరకు కంప్యూటర్ సిస్టంలను సిద్ధం చేసుకోవాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో సర్వే నివేదికలు అందించాలన్నారు. సీపీవో శ్రీనివాసాచారి, డీఆర్‌డీవో శేషాద్రి, జెడ్పీ సీఈవో వినోద్ రెడ్డి, డీసీవో రామకృష్ణ పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో దీర్ఘకాలిక ఆదాయం

• జిల్లా ఉద్యానశాఖ అధికారి కేఆర్ లత



కేఆర్ లత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి

సిరిసిల్ల: ఆయిల్‌పాం సాగుతో దీర్ఘకాలిక ఆదాయం వస్తుందని, ఆసక్తి ఉన్న రైతులు ముందుకొస్తే ఉద్యానశాఖ సహకరిస్తుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి కేఆర్ లత గురువారం తెలిపారు. ఒక్క ఆయిల్‌పాం మొక్కకు రూ.193 ఖర్చు అయితే రైతు రూ.20 చెల్లిస్తే.. మిగిలిన మొత్తాన్ని ఉద్యానవనశాఖ భరిస్తుందని వివరించారు. ఎకరానికి 50 మొక్కలు నాటుకోవాలని, రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తామని తెలిపారు. ఆయిల్‌పాంలో మొదటి ఏడాది అంతరపంటలుగా పప్పు ధాన్యాలు, కురగాయలు, పశుగ్రాసం, పండ్ల మొక్కలు, మునగ వేసుకోవాలన్నారు. అంతర పంటల నిర్వహణ ఖర్చులుగా ఏటా ఎకరానికి రూ.4,200 చెల్లిస్తామన్నారు. నాలుగేళ్ల తరువాత ఆయిల్‌పాం ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని తెలిపారు. ఆయిల్ పామ్ గెలలను ప్రీ-యూనిక్ కంపెనీ టన్నుకు రూ.19,144 చెల్లించి కొనుగోలు చేస్తుందని, అన్ని ఖర్చులు పోను ఎకరానికి ఏటా రూ.1.50 లక్షల ఆదాయం వస్తుందని తెలిపారు. జిల్లాలో 687 మంది రైతులు 2,100 ఎకరాల్లో సాగుచేశారని, ఈ ఏడాది 1500 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్దేశించారని వివరించారు. వివరాలకు ఉద్యానవనాల అధికారులు గోవర్ధన్(సిరిసిల్ల) 89777 14049, లోకేశ్(వేములవాడ) 89777 14048లలో సంప్రదించాలని సూచించారు.

చెరువు శిఖం భూములను కాపాడాలి

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని వన్‌పల్లి కేలోత్ తండా గ్రామస్తులు చెరువు శిఖం భూములు కాపాడాలని గురువారం ఆందోళన చేశారు. సర్వేకోసం తండాకు వచ్చిన ఆర్ఐ ప్రవీణ్‌తో మాట్లాడారు. చెరువుకు సంబంధించిన భూమికి ఎట్లా పట్టాలిస్తారని ప్రశ్నించారు. భూములు కబ్జాకు గురవుతున్నాయని పలుసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తండావాసులను అక్కడి నుంచి పంపించి వేశారు. ఉన్నతాధికారులు స్పందించి భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

బావిలో పడి మహిళ మృతి

వెల్గటూర్: ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతిచెందిన ఘటన మండలకేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన బండమీది మణెమ్మ (57)కు చిన్నతనం నుంచే ఫిట్స్ సమస్య ఉంది. గురువారం సాయంత్రం మంచినీళ్ల కోసం ఇంటిపక్కన ఉన్న బావి వద్దకు వెళ్లింది. నీళ్లు తోడుతుండగా హఠాత్తుగా ఫిట్స్ రావడంతో బావిలో పడి మృతి చెందింది. కూతురు ఎంతసేపటికీ రాకపోవడంతో మణెమ్మ తల్లి గౌరమ్మ చుట్టుపక్కల వెతికింది. పెద్దకుమారుడికి విషయం తెలుపగా బావిలోకి చూడా శవమై కనిపించింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

చికిత్స పొందుతూ ...


వెంగళ దేవి(ఫైల్)

శంకరపట్నం: మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన వెంగళ దేవి(41) పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్సై రవి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తాడికల్ గ్రామానికి చెందిన వెంగళ దేవి ఈనెల 4న పొలం వద్దకు వెళ్లగా అక్కడ పాము కాటేసింది. కుటుంబసభ్యులు హుజూరాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మరణించినట్లు దేవి భర్త కుమారస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వ్యవసాయ బావిలో మృతదేహం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ శివారులోని ఓ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ తెలిపారు. బావిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి వెళ్లి బయటకు తీయించామని, వ్యక్తి వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆగిన గల్ఫ్ కార్మికుని గుండె


శంకర్ (ఫైల్)

వీర్నపల్లి(సిరిసిల్ల): ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి.. అనారోగ్యంతో స్వదేశానికి వచ్చిన వలసజీవి గుండు ఆగిపోయింది. కుటుంబ పెద్ద దిక్కును క్యాన్సర్ కబళించింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన నలిమేటి శంకర్ (50) దుబాయ్ వెళ్లాడు. కొన్ని రోజుల తర్వాత క్యాన్సర్‌కు గురికావడంతో ఇంటికి వచ్చాడు. గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీరకపోగా.. క్యాన్సర్ వ్యాధి చికిత్సకు మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. ఇంటి పెద్ద చనిపోవడంతో భార్య సుశీల, కుమారుడు హరిహరణ్, కుమార్తె శ్రీనిధి రోద్దునపడ్డారు.

పరామర్శకు వెళ్లివస్తుండగా ప్రమాదం

- అదుపుతప్పి స్తంభాన్ని ఢీకొట్టిన కారు
- ముగ్గురికి గాయాలు



ముస్తాబాద్: పరామర్శకు వెళ్లివస్తుండగా కారు అదుపుతప్పి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. సిద్దిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని తెర్లుమద్దికి చెందిన గడ్డమీది రామచంద్రం బంధువును పరామర్శించేందుకు రామచంద్రంతోపాటు అదే గ్రామానికి చెందిన రాయపురాజు లక్ష్మణ్‌రావు, నాగుల నవీన్ బుధవారం వెళ్లారు. పరామర్శించి వస్తుండగా అర్ధరాత్రి వీరు ప్రయాణిస్తున్న ఆకారు అదుపుతప్పి ముస్తాబాద్‌లోని తెర్లుమద్ది క్రాసింగ్ వద్ద కరెంట్ పోల్‌ను ఢీకొట్టింది. కారు వేగానికి విద్యుత్ పోల్ విరిగి కారుపైనే పడింది. కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ఉన్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై గణేశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


రాజన్న ఆలయంలో భక్తులు


ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు

రాజన్నకు కార్తీకమొక్కులు

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా గురువారం భక్తుల రద్దీ నెలకొంది. భారీ సంఖ్యలో వచ్చిన మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. పలువురు భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. రాజన్న ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఆలయ కళావేదిక ప్రాంగణంలో ఈఈ రాజేశ్, డీఈ మహిపాల్‌రెడ్డి, ఏఈ రాంకిషన్‌రావులు జ్యోతి ప్రజ్వాలన చేసి సాంస్కృతిక కార్యక్రమం ప్రారంభించారు. గోదావరిఖని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కళానాటిక మండలి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేత్రపర్వంగా గంగాహారతి

ధర్మపురి: ధర్మపురి వద్దగల గోదావరిలో గురువారం సాయంత్రం గంగాహారతి కార్యక్రమాన్ని నేత్రాపర్వంగా నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాస్, వేదపండితులు, అర్చకులు తదితరులున్నారు.


రాజన్నకు కోడె మొక్కులు చెల్లిస్తున్న భక్తులు





పశువుల్లో పాల ఉత్పత్తి పెంచే లిక్విడ్ స్వాధీనం

- మహారాష్ట్ర నుంచి సిరిసిల్ల ప్రాంతానికి సరఫరా
- ఏడాదికాలంగా కొనసాగుతున్న వ్యవహారం
- పట్టుకున్న సీసీఎస్ పోలీసులు
- విచారించిన ఎక్సైజ్ పోలీసులు


ట్యాంకర్ నుంచి తీసిన లిక్విడ్‌ను పరిశీలిస్తున్న ఎక్సైజ్, సీసీఎస్ పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): పశువుల్లో అధిక పాల ఉత్పత్తి కోసం వినియోగించే ఓ లిక్విడ్‌తో వస్తున్న ట్యాంకర్‌ను సీసీఎస్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు. రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్, ఆవునూర్ గ్రామాల మధ్య ఒక రకమైన లిక్విడ్‌ను సరఫరా చేస్తున్న ట్యాంకర్‌ను సీసీఎస్ పోలీసులు గుర్తించారు. పక్కా సమాచారంతో ట్యాంకర్‌ను వెంబడించి పట్టుకున్నారు. ట్యాంకర్‌లో ఉన్న లిక్విడ్‌ను పరిశీలించగా, మొలసిస్ కలిపినట్లు ట్యాంకర్ సరఫరా చేస్తున్న వ్యక్తి చెప్పడంతో ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ ట్యాంకర్‌లో ఉన్న లిక్విడ్‌ను పరిశీలించగా, చెరుకు పిప్పి నుంచి వచ్చిన ద్రవపదార్థంతోపాటు మరికొన్ని పదార్థాలు కలిసినట్లు పేర్కొన్నారు. పశువుల్లో పాల ఉత్పత్తి పెరిగేందుకు ఏడాది కాలంగా మహారాష్ట్రలోని లాతూర్ నుంచి సిరిసిల్ల ప్రాంతానికి లిక్విడ్ సరఫరా చేస్తున్నట్లు డ్రైవర్ పేర్కొన్నాడు. సిరిసిల్ల ఏరియాలోని డెయిరీ ఫామ్స్‌కు సరఫరా చేస్తున్నామని చెప్పడంతో పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. వారు లిక్విడ్ శాంపిళ్లు సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. అధిక పాల ఉత్పత్తి కోసం పశువులకు దాణాలో ఈ లిక్విడ్ అందిస్తున్నామని పాడి రైతులు పేర్కొనగా, ఎక్సైజ్, సీసీఎస్, పశుసంవర్ధకశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ట్యాంకర్‌ను ముస్తాబాద్ ఠాణాకు తరలించారు. విచారణ చేపడుతున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


ట్రాక్టర్‌ను ఢీకొన్న బస్సు

కోరుట్ల: చెత్త సేకరణకు వెళ్తున్న మున్సిపల్ ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. గురువారం ఉదయం చెత్త సేకరణ కోసం మున్సిపల్ ట్రాక్టర్ ఆరుగురు కార్మికులతో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతోంది. అదే సమయంలో వచ్చిన ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. వారిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో రాగుల కనకతార, బొల్లె కార్తీక్, శనిగారపు సుగుణ, బైరి రాధ, దర్శనం గంగు, రాగుల రేణుక ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థగా ఎన్టీపీసీ

- ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు జనరల్ మేనేజర్లు అలోక్ త్రిపాఠి, సంజీబ్ కుమార్ సాహా


పతాకావిష్కరణ చేస్తున్న జీఎంలు అలోక్ త్రిపాఠి, సంజీబ్ కుమార్ సాహా

జ్యోతినగర్: భారతదేశంలోనే అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి సంస్థగా ఎన్టీపీసీ సంస్థ నిలిచి, దేశ అవసరాలకు విద్యుత్‌ను అందిస్తోందని ఎన్టీపీసీ రామగుండం జనరల్ మేనేజర్లు అలోక్ త్రిపాఠి, సంజీబ్ కుమార్ సాహా అన్నారు. గురువారం రామగుండం ప్రాజెక్టు పరిపాలనా భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేసి, గాలిలోకి బెలూన్లను వదిలి 50వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా ప్రారంభించారు. 1975 నుంచి సింగ్రౌలీలోని ఎన్టీపీసీ సంస్థ ప్రారంభం నుంచి విద్యుత్ ఉత్పత్తి పురోగతితో భారతదేశ విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఎదిగిన తీరును గుర్తు చేశారు. రామగుండం ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తిలో భాగంగా వివిధ యూనిట్ల నిర్మాణం, పురోగతి, పనితీరును వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పాటైన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ-1 పనితీరుతో పాటు రాబోయే భవిష్యత్ ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. సంస్థ మరింత అభివృద్ధి చెందేలా చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలన్నారు. ఎన్టీపీసీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గురుదీప్ సింగ్ ప్రసంగాన్ని వర్చువల్ విధానంలో తిలకించారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగ గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్, అధికారుల సంఘం ప్రతినిధి నితీశ్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోయేషన్ ప్రతినిధి నవనీత్ రాథోడ్, ఏజీఎం హెచ్‌ఆర్ బిజయ్‌కుమార్ సిక్దర్, ప్రవీణ్‌కుమార్ చౌదరి, శ్రీనివాస్, సీఐఎస్ఎఫ్ అధికారులతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

కిరాణంషాపు యాజమానికి రూ.50వేలు టోకరా

- తాళ్లతో బంధించి పోలీసులకు అప్పగింత


తాళ్లతో బంధించిన గ్రామస్తులు

కాల్వశ్రీరాంపూర్: గుర్తు తెలియని వ్యక్తి రూ.50వేలు ఫోన్‌పే ద్వారా మరో వ్యక్తికి ట్రాన్స్‌ఫర్ చేసి మోసం చేసిన సంఘటన పెగడపల్లిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెగడపల్లిలో గల శ్రీనివాస కిరాణ దుకాణంకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి ఫోన్‌పే ద్వారా రూ.50వేలు మరో వ్యక్తికి పంపిస్తే కమీషన్ ఇస్తానని అన్నారు. కిరాణషాపు యజమాని రూ.50వేలు పంపించగా.. తదుపరి మరో రూ.30వేలు పంపించాలని అనడంతో ముందు ఆ డబ్బులు ఇవ్వమని అడిగారు. దీంతో తన వద్ద డబ్బులు లేవని చెప్పి మోసగించాడు. దీంతో అక్కడే ఉన్న గ్రామస్తులు ఆ గుర్తు తెలియని వ్యక్తిని తాళ్లతో బంధించి పోలీసులకు అప్పగించారు. కాగా ఫోన్‌పే ద్వారా డబ్బులు అందుకున్న వ్యక్తి నంబర్‌కు ఫోన్ చేస్తే అతను ఎవరో తనకు తెలియదని, తిరిగి డబ్బులు ఇచ్చేది లేదంటూ దబాయించినట్లు బాధితులు వాపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా ఎస్జీఎఫ్ చదరంగ పోటీలు


పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్‌లోని జీనియస్ చెస్ అకాడమీలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్-14,17 బాల బాలికల చదరంగ పోటీలు ముగిశాయి. పోటీలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. పోటీల్లో రాణించిన క్రీడాకారులను కరీంనగర్ స్పోర్ట్స్ జోన్ జట్టుకు ఎంపిక చేశారు. అండర్-14 బాలికల జట్టుకు సాధన, కీర్తి చైతన్య, శర్వాణి, శాన్విత, వైష్ణవి ఎంపికయ్యారు. బాలుర జట్టుకు కశ్యప్, లిఖిత్, అమాన్‌రామ్, శ్రీహాన్, సాయి శ్రీగన్ ఎంపికయ్యారు. అండర్-17 బాలుర జట్టుకు సాత్విక్, సుప్రీత్, విశాల్, అక్షయ్, గురసింగ్ బాగా, బాలికల జట్టుకు దేవిశ్రీ హర్షిని, సాత్విక, శ్రీ వైష్ణవి, హరిణి, సిరివెన్నెల ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ కార్యదర్శి వేణు గోపాల్, అర్బన్ సెక్రటరీ అంతటి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, రాజ్‌కుమార్ గౌడ్, శ్రీనివాసరావు, సృజన్ కుమార్, సతీశ్‌బాబు, తరుణ్, రేవిక్, నితిన్, శ్రీనిజ పాల్గొన్నారు.

ఎస్సై కారు కహానీపై ఉన్నతాధికారుల ఆరా..!

మెట్‌పల్లి: ఓ ప్రమాదం కేసులో సర్కిల్ పరిధిలోని ఓ ఎస్సై వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. సదరు కేసులో ఎస్సై ఓ ఫిర్యాదుదారు కారును నిబంధనలకు విరుద్ధంగా నెలపాటు అదుపులో ఉంచుకొని ముప్పుతిప్పలు పెట్టిన వైనంపై గురువారం 'సాక్షి'లో 'కారు ఇవ్వడానికి రూ.30వేల లంచం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం. సెప్టెంబర్ 25న జరిగిన ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. మొగిలిపేటకు చెందిన సురేశ్ తన భార్య, కుమారుడితో కలిసి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా.. వెనుక నుంచి కారులో వస్తున్న శంకర్ వారిని ఢీ కొట్టినట్లు సమాచారం. ఆ ఘటనలో బైక్ కింద పడడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు తగలడంతో ముందు భాగం దెబ్బతింది. అనంతరం పరస్పరం ఫిర్యాదు చేసుకోగా.. పోలీసులు సురేశ్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. తర్వాత ఈ కేసులో చట్టపరంగా ముందుకు పోవాల్సిన సదరు ఎస్సై అందుకు భిన్నంగా వ్యవహరించాడు. కారును నిబంధనలకు విరుద్ధంగా నెల పాటు అదుపులో ఉంచుకోవడం వివాదానికి దారి తీసింది. దీనిపై శంకర్ కారు ఇచ్చేందుకు ఎస్సై లంచం అడుగుతున్నాడని పైఅధికారులకు ఫిర్యాదు చేయడం.. తర్వాత వారి జోక్యంతో కారును అతనికి ఇచ్చిన విషయం విదితమే. ఈ వ్యవహారాన్ని 'సాక్షి' వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. అయితే ప్రమాదంలో గాయపడిన బాధితులకు ఆసుపత్రి ఖర్చుల కోసం శంకర్ నుంచి ఆర్థిక సహాయం చేయించాలనే ఉద్దేశంతోనే కారును అదుపులో ఉంచుకున్నామని, తాను లంచం అడగలేదని సదరు ఎస్సై ఉన్నతాధికారులకు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. ఎస్సై లంచం అడగకపోయినా కారును అదుపులో ఉంచుకోవడం తప్పేనని ఓ అధికారి 'సాక్షి'తో చెప్పడం గమనార్హం.

దూలూర్‌లో సామాజిక బహిష్కరణ


గోడు వెల్లబోసుకుంటున్న దూలూర్ గ్రామ యాదవసంఘం సభ్యులు

కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామంలో యాదవ కులస్తులను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు సామాజిక బహిష్కరణ చేసిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గ్రామ యాదవ కుల సంఘం సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం ఇచ్చి తమ గోడు వెల్లబోసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని ఎస్సారెస్పీ వరద కాలువ మట్టి తవ్వకాలు, మట్టి తరలింపు విషయంలో వివాదం జరిగింది. దీనిపై గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను ప్రశ్నించినందుకు తమను సామాజిక బహిష్కరణ చేశారని యాదవ కులసంఘం సభ్యులు వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు బైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్: ప్రేమించి పెళ్లికి నిరాకరించిన ప్రియుడి ఇంటి ఎదుట తనకు న్యాయం చేయాలంటూ ఓ యువతి బైఠాయించిన సంఘటన కాల్వశ్రీరాంపూర్ మండలం కూనారంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువతి అదే గ్రామానికి చెందిన యువకుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరిది ఒకే ఊరు, ఒకే కులం. నిరుపేద కుటుంబానికి చెందిన యువతి పెద్దపల్లిలో ఇంటర్ చదువుతుండగా పెద్దపల్లిలో ఐటీఐ చదువుతున్న యువకుడు నాలుగేళ్లుగా ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇప్పుడు తమ వారు వద్దంటున్నారని పెళ్లికి నిరాకరించాడని యువతి వాపోయింది. వీరిరువురూ పెళ్లి చేసుకోవాలని ఇటీవల పెద్ద మనుషులకు చెప్పినప్పటికీ యువకుడి కుటుంబసభ్యులు ఒప్పుకోకపోవడంతో యువకుడితో పాటు కుటుంబసభ్యులు ఇల్లు వదిలి వెళ్లారు. ప్రేమించిన యువకుడితో తన పెళ్లి జరిపించి తనకు న్యాయకు న్యాయం చేయాలని ప్రియుడి ఇంటి ఎదుట యువతి బైఠాయించి గ్రామస్తులను వేడుకుంది. యువతికి గ్రామస్తులు, మహిళలు అండగా నిలిచారు. విషయం తెలుసుకున్న ఎస్సై వెంకటేశ్, ఏఎస్సై నీలిమ ఇరు కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించి పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

డిపాజిట్ల గల్లంతుపై కొనసాగుతున్న విచారణ

రామగిరి: బేగంపేట పోస్టాఫీస్‌లో డిపాజిట్‌ల గల్లంతులపై తపాల శాఖ అధికారుల విచారణ కొనసాగుతోంది. గురువారం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, సిబ్బంది ఇంటింటికీ తిరిగి బీపీఎం స్వాహా చేసిన డబ్బులకు సంబంధించిన ఖాతాదారుల పాస్ పుస్తకాలను పరిశీలించారు. 42 మందికు సంబంధించిన రూ.33.13 లక్షలు గల్లంతు అయినట్లు అధికారులు గుర్తించగా.. గల్లంతు అయిన డబ్బు విషయంలో ఎలాంటి స్పష్టత రాకపోవడంతో బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూలీ చేసి పిల్లల భవిష్యత్ కోసం పొదుపు చేస్తే భద్రత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

కలెక్టర్ ఆరా..

బేగంపేట పోస్టాఫీస్‌లో డిపాజిట్‌లు గల్లంతైన విషయంపై గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆరా తీశారు. బాధితులు ఎంత మంది, డిపాజిట్‌లో గల్లంతైన సొమ్ము ఎంత, ఇప్పటివరకు బాధితులు పోలీసుస్టేషన్‌లో ఎందుకు ఫిర్యాదు చేయలేదో పలు విషయాలపై సమగ్ర విచారణ నిర్వహించాలని తహసీల్దార్ రాంచందర్ రావును ఆదేశించినట్లు సమాచారం. అలాగే ఈ విషయంపై శుక్రవారం పోస్టల్ అధికారులు రామగిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.


వివాహిత ఆత్మహత్య

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేటకు చెందిన బొడ్డు రజిత (38) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం రజిత భర్త రాజేందర్ కొంతకాలంగా గల్ఫ్ దేశం వెళ్తున్నాడు. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులు లేచే సరికి రజిత ఇంట్లో లేదు. కుటుంబసభ్యులు వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం రజిత మామ లక్ష్మీరాజం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లగా అందులో శవమై కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. రజిత మూడేళ్లుగా మానసికంగా, ఆరోగ్యపరంగా బాధపడుతోందని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉచిత రేషన్ మరో నాలుగేళ్లు

- 2028 డిసెంబర్ వరకు పొడిగింపు
- కేంద్రం నిర్ణయంతో లక్షల లబ్ధిదారులకు ప్రయోజనం

కరీంనగర్ జిల్లాలో మొత్తం కార్డులు: 2,76,620
యూనిట్లు: 8,17,156
రేషన్ దుకాణాలు: 566
పంపిణీ చేసే బియ్యం: 49.02లక్షల కిలోలు



కరీంనగర్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు మరో నాలుగేళ్లు ఉచిత బియ్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించింది. ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోలు ఉచితంగా ఇవ్వనుండగా ప్రభుత్వం ప్రతినెల చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 566 రేషన్ దుకాణాలుండగా.. యూనిట్‌కి 6 కిలోల చొప్పున కార్డుదారులకు బియ్యం సరఫరా చేస్తున్నారు. కోవిడ్ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తొలుత యూనిట్‌కు 12 కిలోల చొప్పున ఆ తర్వాత పది కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేసిన విషయం విదితమే.

బ్లూటూత్‌తో వేమెంట్

ఇన్నాళ్లు ఎంఎల్ఎస్ పాయింట్ (మండలస్థాయి నిల్వ కేంద్రాలు)ల నుంచి రేషన్ దుకాణానికి బియ్యం సరఫరా జరిగేది. ఒక్కోసారి స్టేజ్-1 నుంచి వచ్చిన బియ్యాన్ని నేరుగా దుకాణాలకు సరఫరా చేస్తున్నారు. స్టేజ్-1 గుత్తేదారు తక్కువ పరిమాణంలో బియ్యం పంపుతుండగా ఆ భారం డీలర్లపై పడుతోంది. ఇక వేమెంట్ చేసినా నామమాత్రపు చర్యలతో డీలర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో డీలర్ వారీగా పంపే రేషన్ బియ్యాన్ని ఇక బ్లూటూత్ ద్వారా వేమెంట్ చేయనున్నారు. రేషన్ దుకాణాల్లో తూకానికి, ఈ-పాస్ మిషన్‌కు అనుసంధానమున్నట్లే అదే తరహాలో తూకం వేయనుండగా కిలో కూడ తేడా రాదన్నది నిర్వివాదాంశం. వీలైనంత త్వరగా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా తదనుగుణ చర్యలు చేపడుతున్నారు.

పెరగనున్న కోటా

జిల్లాలో 566 రేషన్ దుకాణాలుండగా 2.76లక్షల కార్డులున్నాయి. ఆహారభద్రత కార్డులు 2.52లక్షలుండగా అంత్యోదయ కార్డులు 12వేలకు పైగా ఉండగా అన్నపూర్ణ కార్డులు 28 ఉన్నాయి. సాధారణంగా ఒక్కో యూనిట్‌కు 6కిలోలు, అంత్యోదయ కార్డుకు 35కిలోల చొప్పున బియ్యాన్ని అందించేవారు. కాగా కేంద్రం యూనిట్‌కు 5కిలోలు, అంత్యోదయ కార్డుదారులకు 35కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10కిలోల చొప్పున ఉచితంగా బియ్యం ఇవ్వనున్నారని సమాచారం. అయితే ఉచిత రేషన్ ప్రకటన విన్నామని, ఇంకా ఉత్తర్వులు రాలేదని పౌరసరఫరాలశాఖ అధికారులు వివరించారు.